శ్రీవారి దివ్యోపన్యాసము క్రిష్టమస్ 2003

ఏగుణంబు గణించి యేతెంచెనోనాడు
ప్రహ్లాదు పాలింప పరమపురుషు
ఏగుణంబు గణించి యేతెంచెనోనాడు
కరినిగాచెడి తరి కమలనయను
ఏగుణంబు గణించి యేతెంచెనోనాడు
ధ్రువకుమారుని సాక రూఢిమీర
ఏగుణంబు గణించి యేతెంచెనోనాడు
పేదకుచేల్రబ్రోవ వేదచరితు
డాగుణంబె గణించి యాయమరవంద్యు
డార్తజనులను పాలించునట్టివాడు
శ్రీనివాసుండు లోకైక చిన్మయుండు
వెల్గె పర్తీశుడై నేడు పుడ్వియందు.

ప్రేమస్వరూపులారా!

భగవంతుడెక్కడ, ఎట్లవతరించెను అనే ప్రశ్నలు కాలహరణము గావించేవి. లోకములో ఏది పుట్టవలెనన్నను దానికి కారణకార్యాలు కలసిరావాలి. భగవంతుడు సర్వత్రా ఉంటున్నాడు. సర్వులూ భగవత్స్వరూపులే. ఈశ్వరుడు, రాముడు పుట్టిన దినము, కృష్ణుడు పుట్టిన దినము, జీసస్ పుట్టిన దినము అని పేర్లు వేరువేరుగా వర్ణించి ఆ నామమునకు పుట్టిన దినము చేసుకుంటున్నారు. ఈవిధముగా చెప్పుకొని ఆరాధించటంచేత అవి పుట్టినదినములౌతాయా? కావు. భగవంతుడు సంవత్సరమునకు ఒక్కతూరి జన్మించడు. ప్రతి మానవుని ఉచ్ఛ్వాసనిశ్వాసములే భగవత్స్వరూపాలు. తత్, త్వం అది, ఇది అని రెండు పదములు మాత్రమే ఉన్నవిగానీ అతను ఇతను అని భేదభావములు లేవు. భగవంతునికి ఎట్టి జన్మములు లేవు. ఎట్టి గమ్యములు లేవు. కాని పామరులైన మానవులు విశ్వాసమును పెంచుకొనే నిమిత్తమై యీ విధమైన జననమరణాలు నిరూపిస్తూ వచ్చారు. భగవంతుడు పుట్టటముటుంటే గిట్టటంకూడా ఉంటుంది కదా! పుట్టుక చావు రెండుకూడను లేవు. అంతా మానవునియొక్క భ్రమయే. దేహము పురస్కరించుకొని దానిని ఆరాధన చేసుకుంటూ యిదియే పుట్టిన దినమని భావిస్తున్నారు. ఇది కేవలం భక్తుని యొక్క భ్రమలేగానీ సత్యములు కావు.

లోకములో ఎందరో జన్మిస్తున్నారు, ఎందరో మరణిస్తున్నారు. జననం అంటే ఏమిటి? మరణం అంటే ఏమిటి? దేహము కనిపించటమే జననము. దేహము కనిపించకుండా పోవటమే మరణము. కనుక మానవుడు భ్రాంతులను సృష్టించుకొని భ్రమిస్తున్నాడేగాని భగవంతునికి పుట్టుక చావు లేవు.

మానవుడు జన్మించినాడని, జీవించినాడని, మరణించినాడని తెలుపుకోటము కేవలము అజ్ఞానము యొక్క ప్రతిబింబమే. పుట్టుక, చావు రెండు భగవంతుని సంకల్పములే. మనము ఉచ్ఛ్వాసము తీసుకోటమే పుట్టుక, వదలటమే గిట్టుట. ఈ రెండింటి సంబంధమైన కారణాన్ని గుర్తించుకొని కాలము స్వల్పంగా వారు వినియోగించుకుంటున్నారు. ప్రేమమూర్తియైన భగవంతుడు ప్రేమస్వరూపుడే. ఈ ప్రేమ సర్వులయందు ఉచ్ఛాసనిశ్వాసములుగా కనిపిస్తూనే ఉన్నది. లోకములో యిట్టి మార్పులు గుర్తించుకోటానికి అనేక రకములైన యోచనలు చేస్తున్నారు. ఈ చావు పుట్టుకలు గుర్తించుకునే నిమిత్తమై అనేక శాస్త్రములు పరిశోధించి, అనేక పరిశోధనలు సలుపుతూ వచ్చారు. అంతవరకు మనం పోనక్కరలేదు. మనం ధరించిన దేహము రెండింటినీ క్షణక్షణము చూపుతున్నది. శ్వాసను తీసుకోటమే

జననము, శ్వాసను వదలటమే మరణము. ఈ జనన, మరణాల్లో నీవు దేనిని ప్రేమిస్తున్నావు? దేనినీ ప్రేమించటం లేదు. కానీ ప్రేమ నీయందు లేదా? ఉంది. మనము యిచ్చే విలువలు ప్రేమకేగానీ ప్రాణికి కాదు. ఒక చిన్న ఉదాహరణ తీసుకోండి. సో... ప్రాణం లోపలికి పోయింది. హం...వచ్చింది ప్రాణం. ఈ రెండూ ఎప్పుడూ మనకు జరుగుతున్నాయి. ప్రతి క్షణము యీ రెండు మనకు బోధిస్తూనే ఉన్నవి. ఈ శ్వాసము ఉండినంత వరకు మానవుని జీవుడు అన్నారు. ఈ జీవితమున్నంత వరకు మానవుని జీవుడు అన్నారు. ఈ జీవితమున్నంత వరకు జననము అన్నారు. సోహం అనేది నిల్చిపోయెనా మరణం అంటున్నారు. కనుక జననమరణాలు మనయొక్క ప్రాణం నుండి వచ్చినవే. ఈ రెండింటియందు యింతింత మార్పులు జరుగుతుండగా భగవంతుడు ఉన్నాడని లేదని ఎవరు సాధించగలరు? ఉన్నాడని కొంతమంది, లేదని కొంతమంది యీ విధంగా వాదోపవాదములతో కాలము వ్యర్థము చేస్తున్నారేగానీ యివి రెండూ సత్యములు కావు. కానీ ఉన్నాది. ఎప్పటికీ ఉన్నాది. పోవటము, రావటము అనేది లేదు. దేహము ఆధారము చేసుకొని యీ రెండు తత్త్వములను మనము ప్రబోధిస్తున్నాం.

ఏ హృదయంబునొసగితివొ ఆశ నాకు<br>
మగిడి దానినే యర్పింతు మహితమూర్తి<br>
పరగ వేరేమిదెత్తు నీ అర్చనకును<br>
అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు.

కనుక యీ రెండూ మానవుని టొక్క భ్రాంతులేగానీ నిజమైన సత్యములు కావు.

లోకములో ఎన్నయో జీవులు పుడుతున్నాయి. ఎన్నియో జీవులు మరణిస్తున్నాయి. ఈ జననమరణములు రెండూ కాలమునకు సంబంధించినవేగానీ కాయమునకు సంబంధించినవి కాదు. కనుక, మానవుడు తనయొక్క సత్యమునే తాను పోల్చుకుంటున్నాడు. దీనిని పురస్కరించుకొనియే అట్టి దేహముతో కూడిన సంబంధభాంధవ్యములను అనుభవిస్తున్నారు. ఇదికూడా చాలా పొరపాటే. దేహముండినంత వరకు నా సంబంధము. కానీ యిది పోతూనే నా సంబంధము లేదు. సంబంధము కలగటము, పోవటము కేవలము దేహములతో కలగటం కాదు. ఎవరికెవరు సంబంధము? ఆయన నీవు పుట్టక పూర్వము ఉన్నాడా? వెళ్లిన తరువాత కనిపిస్తాడా? లేదు. ఈ రెండింటి యొక్క తత్త్వములు అసత్యములే. భ్రమలతోగూడి బ్రహ్మత్తత్త్వాన్ని గుర్తించుటకు పాటుపడుతున్నారు. కనుక, ఈ బాహ్యమైన, ప్రకృతమైన పరతత్త్వమునకు మనం సరైన అర్థము తెలుసుకోటం లేదు. అసలు తానెవరో గుర్తించుకోటమే నిజమైన సాధన. నేనెవరు అనే సత్యాన్ని గుర్తించుకోటం కోసమే యిన్ని విధములైన సాధనలు సల్పుతున్నారు. నీయందున్న 'నేనే' సర్వులయందు ఉంటున్నది. నీవు, నేను అని భేదభావములచేత కలహములను పొంది అశాంతికి గురిచేస్తున్నాయి.

ప్రేమస్వరూపులారా! జననమరణములు దేహమునకేగానీ జీవునకు లేవు. ఉన్నది, లేనిది అని నిర్ణయించటం మనస్సు యొక్క కల్పనే. అన్నీ మానవుని యొక్క కల్పనల చేతనే జరుగుతున్నాయి. కనుక, జీవితమే ఒకవిధమైన కల. ఇట్టి జీవితము లోపల సత్యమునెట్లు గుర్తించగలవు? ఇవన్నీ కూడా భ్రాంతులే. ఈ భ్రాంతి ఉన్నంత వరకు బ్రహ్మము కనిపించదు. ఏనాడు యీ భ్రాంతి మనము వదలుకొందుమో ఆనాడే మన జన్మమునకు తగిన గుర్తు. 'నేను ఎవరు' గుర్తించాలంటే శ్వాసముతోనే గుర్తించ వచ్చు. ఇలాంటి సులభమైన మార్గము వదలి కష్టమైన దానిలో ప్రవేశించి కంగారుతో జీవితముపై విసుగు చెందుతున్నారు. కాలులో ముల్లు ఉండినంత వరకు మనకు బాధ కలుగుతుంది. ఆ ముల్లు తీసి పారవేస్తిమా మనకు ఎట్టి బాధలు ఉండవు. ఈ దేహము 'నేను, నేను' అనే భ్రాంతి చేత బాధ పడుతున్నాము. ఈ భావము పూర్తి తీసివేస్తిమా నీవు ఎవరో నీకే తెలుస్తుంది. కనుక, ఇవన్నీ భ్రాంతులతోనే జరుగుతున్నాయి.

ఒకనాడు ఒకనికి స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో తాను మరణించినట్లు అయింది. అక్కడ నేను మరణించానని బాధపడుతున్నాడు. అప్పుడు పోయాడని చెప్పి భావించినది ఏది? ఇది కూడా మనోకల్పనే. ప్రతి ఒక్కటి మానవుని యొక్క భ్రాంతులేగానీ సత్యములు కావు. నా బిడ్డ, నా కుమరుడు, న తల్లి, నా తండ్రి యివన్నీ భ్రాంతులుకాక నిజమైన సంబంధములా? ఈవిధమైన భ్రాంతులు పుట్టించుకొని, యీ భ్రాంతులు పెంచుకొని తదుపరి తాను అనేక రకములైన కష్టములకు గురౌతున్నాడు. ఇవన్నీ ప్రేమ యొక్క ప్రభావములే. నిత్యసత్యమైన ప్రేమతత్త్వమే తనయందున్నప్పుడు యీ రెండు భావములు కనిపించవు. ప్రేమ ఒక్కటే. రెండు రకములైనటువంటిది కాదు. శారీరకంగా ఉండే ప్రేమ అసత్యమైనది. ఆత్మతత్త్వముగా బోధించుకున్నప్పుడు అదియే సత్యమైనది. కనుక, మనము సత్యమును గుర్తించాలంటే కొంత శోధన చేయాలి. ఈ రెండూ నీ యందే పుట్టి, నీయందే అణిగినవిగానీ బయటనుండి వచ్చినవి కాని, పోయినవిగానీ కాదు. మానవునియందు భ్రమ చేరిపోవటం చేత బ్రహ్మ దూరంగా ఉండినట్లు కనిపిస్తుంది. బ్రహ్మయే తానని గుర్తించినప్పుడు భ్రమ తనయందు ఉండనే ఉండదు. నిజంగా నా దగ్గర భ్రమ లేదు అని తెలుసుకోటం చాలా సులభం. ఇది ఒక పుష్పము. ఈ పుష్పము నా చేతిలో ఉండినంత వరకు నా పుష్పము అంటున్నావు. కానీ క్రింద పడవేస్తే ఆ పుష్పము లేదు. అదేవిధంగా దేహమే నేను అని భ్రాంతి ఉన్నంత వరకు దేహాభిమానముచేత మానవుడు అనేక రకములైన దుఃఖములకు గురౌతున్నాడు. ఈ దేహము పోయన తరువాత తనకి యే చింతా లేదు. అప్పుడే తాను నిత్యానందంగా ఉంటాడు.

ప్రేమస్వరూపులారా! సుఖదుఃఖములు రెండూ మనం కల్పించుకున్నవేగానీ భగవంతుడు ప్రసాదించినవి కాదు. రెండింటిని మనమే కల్పించుకొని రెండింటి ద్వారా మనమే బాధ పడుతున్నాము. ఎవరూ బాధనందించే వారు యీ జగత్తులో కానరారు. ఈ బాధలు కల్పించేవారు ఎక్కడా కానరారు. రెండూ కూడా నీవే కల్పించుకుంటున్నావు. రెండూ భ్రమలే. ఆ భ్రమ మనయందుండినంత వరకు సత్యమైన బ్రహ్మ మనకు తెలియదు. కనుక, యి భ్రమను మనం వదలుకోవాలి. సుఖదుఃఖములు రెండూ భ్రమలేగానీ మరొకటి కావు. బిడ్డ, తల్లి అని భ్రమేగానీ నిజంగా బిడ్డాతల్లి కారు. భగవద్విషయంలో ప్రవేశించినప్పుడు అన్నీ భ్రాంతులే. తెల్లవారి లేచినది మొదలుకొని రాత్రి పరుండినంత వరకు మనకు యీ భ్రమలే జీవితాన్ని నడిపిస్తున్నాయి.

జన్మించిన మానవుడు ఎంతవరకు తాను సత్యంగా ఉండగలడు? క్రమక్రమేణా పెరుగుతూ పెరుగుతూ పోతుంది, తరువాత కృంగుతూ కృంగుతూ వస్తుంది. పుట్టటము, పెరగటము యివన్నీ అసత్యములే. కాని యిది సత్యముగా భావించుకొని అనేక బాధలు పడుతున్నాం. కనుక, మనం ఏది చేసినప్పటికి సత్యములు కాదు. నీ కన్నులు తెరచి చూస్తే యిన్ని శిరస్సులు కనిపిస్తున్నాయి. కాని కన్నులు మూసుకుంటివా ఒక్క శిరస్సైనా కనిపించదు. ఆ చిత్రములంతా ఎక్కడికి పోయినాయి? ఆ చిత్రములు ఎక్కడనుంచి వచ్చాయి? ఎక్కడనుంచి వచ్చాయో అక్కడికే పోయాయి. ఎక్కడనుండి వచ్చిందో నీకు తెలియదు. ఎక్కడికి పోయిందో నీకు తెలియదు. కనుక, తెలియని దానిని పట్టుకొని మనం బాధ పడుతున్నాం. ఈ తెలియని దానికోసం బాధ పడటం ఎంతటి వెఱ్ఱితనము. ఇది ఏదీ నేను కాదు, నాది కాదు అనే సత్యాన్ని గుర్తించుకున్నప్పుడు నీకు ఎట్టి బాధ ఉండదు. అన్నీ మనం భ్రమలతో కల్పించుకుంటున్నామేగాని సత్యమైనది ఒక్కటీ లేదు.

ప్రేమస్వరూపులారా! ఈ ప్రే అనేది ఒక్కటే మన యింటా, వెంటా, జంటా ఉంటున్నాది. ఈ ప్రేమ అనేది లేకపోతే మానవుడే లేడు. ప్రేమ మనకు నిజమైన ప్రాణము. ఆ ప్రేమయే మనకు కాంతి (లైటు) లవ్ ఈజ్ లైట్. ఆ కాంతిని మనం పెట్టుకుంటే యీ అజ్ఞానమనే చీకటి మనకు గోచరం కాదు. దీనిని పురస్కరించుకొనియే 'పునరపి జననం పునరపి మరణం'. ఏది కనిపించినదో అది కనిపించకుండా పోతున్నది. ఏది కనిపించకుండా పోయినదో అదే తిరిగి వచ్చి కనిపిస్తున్నాది. రెండూకూడా ఆ వస్తువుల యొక్క పరిణామము కాదు. వస్తువులపైనున్న మానవుని

యొక్క ప్రభావమే. కనుక, మానవుడు యిట్టి ప్రభావమునకు గురైపోయి ప్రమాదము కల్పించుకుంటున్నాడు.

ప్రేమస్వరూపులారా! ప్రేమ ఎప్పటికీ చావనటువంటిది. ఎప్పటికీ చావని ప్రేమయే నిజమైన ప్రేమ. వచ్చి పోయే ప్రేమ ప్రేమయే కాదు. ఈ దేహము పెరుగుతున్నాది, తరుగుతున్నాది. ఈ పెరిగి తరిగే దేహతత్వము నీవు సత్యమని భావిస్తున్నావు. ఏదీకాదు. ఈ సర్వ భ్రాంతులకు ఈ దేహమే మూలకారణము. కనుక, యీ దేహాభిమానమును క్రమక్రముగా తగ్గించుకోండి. ఇదియే సరైన సాధన. సాధన అనగా జపము, తపము. యోగము, ధ్యానము చేయటము కాదు. నేను యేది సత్యమని భావిస్తున్నానో ఆ సత్యాన్ని వదలాలి. అది వదలటం చాలా సులభం. కానీ ఎందుకింత బాధ పడుతున్నారో నాకు అర్థం కావటం లేదు. ఉండినంతవరకు మనం ఆనందాన్ని అనుభవిస్తున్నాం. కానీ దేహమునుండి శ్వాస పోతే యేమాత్రము యోచించుకొనకుండా బాధ పడుతున్నాము. ఈ జననమరణములకు మన భ్రాంతులే మూలకారణము. ఈ భ్రాంతులు వదలుకోటానికి ప్రయత్నించాలి. దేహాభిమానము కొంతవరకు తగ్గించుకోవాలి. తగ్గించుకుంటూ, తగ్గించుకుంటూ రావటం చేత యీ అభిమానము పూర్తి నశిస్తుంది. అదియే నిజమైన సాధన. ఈ సాధన అంతా ఏమిటి? ఉన్నదానిని పోగొట్టుకోటం సాధన అనుకుంటున్నారా? కాదుకాదు. పోయేది నాది అనుకుంటున్నావా? అదికాదు. ఉన్నదిగానీ, పోయేదిగానీ నీది కాదు. స్వప్నము వలె ఆ భ్రాంతులు నిన్ను తబ్బిబ్బు చేస్తున్నాయి. అన్నింటికీ మూలకారణము ఒక్కటే. చూడండి. ఎన్నో బల్బులు కనిపిస్తున్నాయి. ఎంచుకోటానికి పోతే చాలా ఉన్నాయి. ఇన్ని బల్బులలో కరెంటే ప్రధానము. ఆ కరెంటే సత్యమైనది. ఈ రావటము, పోవటమ యీ భ్రాంతుల యొక్క ఫలమే.

ప్రేమస్వరూపులారా! మీరు ప్రేమను అభివృద్ధి చేసుకోండి. ఎవరిని చూచినా ప్రేమించండి. నీకెదురుగానున్నవాడు నీకు ద్వేషి కాడు. నీకందరూ ప్రేమింపబడేవారే. నిన్ను ద్వేషించినవాడు నీవాడు కాదనుకుంటున్నావు. ప్రేమించినవాడే నావాడు అనుకుంటున్నావు. ఈ రెండూ కానేకాదు. వచ్చిపోయే భ్రాంతులే నీ భ్రమలు. ఈనాడు భగవంతుని తత్వాన్ని గుర్తించుకోవాలని యెన్నియో సాధనలు చేస్తున్నారు. ఏమిటీ సాధనలు? ఈ సాధన లోపల భగవంతుడు వస్తున్నాడా? ఈ సాధనలతో భగవంతుడు పోతున్నాడా? భ్రాంతులే పోతున్నాయి. భ్రాంతులే వస్తున్నాయి. కనుక, ఈ భ్రాంతులను పోగొట్టుకోటానికి తగిన ప్రయత్నంచేయి. నేనునేను అనే భ్రాంతిని నీవు వదలుకో. అప్పుడే ఎట్టి భయభ్రాంతులు ఉండవు. ధ్యానములో కూర్చోటము, జపములు చేయటము సాధనలు సల్పటమని అనుకుంటున్నాము. ఈ సాధనలు , జపములు, తపములు మన భ్రాంతికోసం చేస్తున్నాంగానీ నిజమైన బ్రహ్మకోసం కాదు. ఇవన్నీ వదలిపెట్టు. నేనే దైవం, నేనే దైవం, నేనే దైవం అని తలచుకో. నీవే దైవమైపోతావు. ఈ దేహము ఒక వస్త్రము. ధరించిన వస్త్రమేగాని పుట్టిన వస్త్రము కాదు. ఈ దేహభ్రాంతిని మరింత పెంచుకుంటే దుః ఖము మరింత పెరిగిపోతుంది. నీకు కావలసింది ఒక్కటే. లోకములో ఎక్కడ చూచినా అనేకమంది కనిపిస్తున్నారు. ఈ కనిపించే వారంతా అనేకమందా? కానేకాదు. అన్నీ ఒక్కటే. తల్లీ తనే, తండ్రీ తానే, బిడ్డా తానే, చెల్లెలు తానే, అక్క తానే. పేర్లు మనం పెట్టుకుంటున్నాం కానీ ఏదీ కాదు. కనక, సత్యం ఒక్కటే. సత్యం ఒక్క దానినే మనం పెట్టుకోవాలి. అందులోనే ప్రేమ ప్రవాహమవుతుంది. ప్రేమ ప్రవాహము లోపల మనం నిల్చి పోవాలి. దానిలో మునిగి పోవాలి. ఎట్టిపరిస్థితియందైనా ప్రేమను మాత్రం మార్చుకోకండి. ఎవరైనా నీకు ద్వేషుడైనవాడు బజార్లో కనిపించినప్పుడు 'నావాడే, నా తమ్ముడే' అనుకో. వీడు నా ద్వేషి అనుకుంటివా తప్పక నీకు వచ్చేసింది ఫలితము. అంతా ఒక్క త్యాగములోనే ఉంటున్నాది.త్యాగమే నిజమైన యోగము. ఈ త్యాగమనే యోగమును మనం పెంచుకోకుండా రోగమనే దేహాన్ని పెంచుకుంటున్నాము. కనుక, త్యాగము మనం పెంచుకోవాలి. ఈ త్యగమున్నప్పుడే మనకు బాధ కలగదు. మనము చేయవలసినది భ్రాంతులు పెంచుకునే సాధన కాదు. భ్రాంతులు వదలుకునే సాధన చేయాలి. దినదినానికి, దేహాలు పెరుగుతున్న కొలదీ మన భ్రాంతులు పెరుగుతున్నాయేగానీ తరగటం లేదు. మనం

తెలుసుకోవలసినది ఒక్కటే ఒక్కటి. ఇది నాది కాదు. నాది అనేది ఏమిటి? నాయందున్న 'నేనే' నేను.

ప్రేమస్వరూపులారా!సాధనలు అనేకమంది సాధనలు చేస్తూనే ఉన్నారు. జపము, ధ్యానముచేస్తున్నారు. కానీ యివన్నీ వ్యర్థమైనవే. అయితే కొంతకాలమునకు యివే మార్పులు కలుగుతాయి. ఈ తాత్కాలికమైన సాధనలు సత్యమైనవి కాదు. అంతా అనిత్యము, అసత్యము. ఈ అనిత్యమునకు మనం విచారించరాదు. మనం ఎప్పుడూ సత్యమైన దానిని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఎట్టి పరిస్థితియందైనా కంటిధారలు కార్చకూడదు. దేనికోసం మనం బాధ పడుతున్నాం? ఇది నాది అనుకున్నంత వరకే. నాది కాదనుకున్నప్పుడు ఏ బాధా ఉండదు. కనుక, నీవు బాధ పడకుండా నిరంతరము శాంతిగా ఉండాలనుకుంటే 'నేను నేనే' అనే సత్యాన్ని గుర్తించాలి. ఈ విధంగా మీరు భావించుకుంటే మిమ్మల్ని ఏవిధమైన బాధలు బాధించవు. ముఖ్యంగా మీరు దేహాభిమానము, దేహమునకు సంబంధించిన వస్తువుల యొక్క అభిమానాలు ఏమాత్రము పెంచుకోకండి. ఈ విధముగా త్యాగము అభివృద్ధి పరచుకుంటే అన్నివిధాలా ధన్యుడౌతావు. మీరు సాధించవలసినది త్యాగమేగానీ భోగము కాదు. ఇది నాకు కావాలి అనుకునేదే భోగము. ఇది నాది కాదు అనుకునేదే యోగము. ఆ యోగమే నిజమైన, తగిన బలము.

ప్రేమస్వరూపులారా!ఇట్టి బలమును గుర్తించుకునే నిమిత్తమై జీసస్ అనేక సాధనలు చేస్తూ వచ్చాడు. ఒకనాడు తల్లిదండ్రులు జీసస్‌ను తిరునాళ్లకు జరూసలెం తీసుకువెళ్లారు. జనం వత్తిడి వల్ల పల్లవాడు కనిపించకుండా పోయాడు. ఆ పిల్లవాడు ఎక్కడున్నాడు? చర్చిలో ప్రవేశించి ప్రీస్టు చెప్పిన విషయాలంతా చక్కగా వింటున్నాడు. తల్లిదండ్రులు వెతుకుతున్నారు. సూర్యాస్తమయము వరకు వెతికారు. కనిపించలేదు. మేరీ, జోసెఫ్ యిద్దరూ బాధపడుతున్నారు. పూజ అయిన తర్వాత పిల్లవాడు కనిపించాడు. 'నాయనా! ఎక్కడికి పోయావు? తెల్లవారి మొదలుకొని యిప్పటివరకు వెతుకుతున్నాము'. 'అమ్మా! ఎక్కడికీ పోలేదు. కాలు గడప దాట లేదు. నేను లోపలనే ఉన్నాను'. 'ఏమి చేస్తున్నావు?' ' చెప్పే విషయాలు తప్పక జరిపే ప్రయత్నం చేస్తున్నాను'. అట్లే తనయందున్న తత్త్వాన్ని మానవుడు కనుక్కోవాలంటే బయట వెతుకుతున్నాడేగానీ తనలోపల వెతకటం లేదు. ఈనాడు ప్రతిమానవుడు భగవంతుని బయట వెతుకుతున్నాడేగానీ తనయందున్న భగవంతుని వెతకటంలేదు. తనయందే ఉంటున్నాడు భగవంతుడు. తానే భగవంతుడుగా ఉన్నాడు. కానీ బయట వెతుకుతున్నాడు. ఒక చిన్న ఉదాహరణ. మీరే చూచుకోండి. నీవు యిక్కడే ఉన్నావు. నీవు బయటకు పోయి నిన్ను నీవు ఏవిధంగా చూడగలవు? చూడటానికే వీలుకాదు. అంతమాత్రముచేత నేను లేదనుకుంటావా? అంతా వెతుకుతూ ఫలానా అబ్బాయి ఉన్నాడా అని అడిగితే 'నీవేనయ్యా, ఫలానా అబ్బాయి' అని చెబుతారు. అప్పుడు తన సత్యాన్ని గుర్తించుకోగలడు. ఈ ఏకత్వాన్ని గురించి తెలుసుకోటం చాలా సులభమే కానీ దాన్ని నమ్మాలి పూర్తిగా. నేను అనేది నాకంటే బయట లేదు. నాయందే ఉంటున్నది. కనుక, తపశ్శక్తి చేత తాను లోపల బయట కనిపిస్తూనే ఉంటాడు.

ప్రేమస్వరూపులారా! నిన్ను నీవు వెతుక్కోటమే నిజమైన సాక్షాత్కారము. అది తెలుసుకుంటే యింకే బాధలు ఉండవు. ఒకడు పుస్తకం చదువుతున్నాడు. చదువుతున్నప్పుడు పది రూపాయలనోటు పుస్తకంలో పెట్టాడు. మర్చిపోయాడు. మరొకనాడు ఒక స్నేహితుని పదిరూపాయలిమ్మని అడిగాడు. ఇస్తాను కూర్చోమన్నాడు. ఏమిచ యీ పుస్తకమని దానిని తీసుకొని చదువుతూ వచ్చాడు. దానిలో పదిరూపాయలనోటు కనిపించింది. అప్పుడు,'అయ్యో! నా పుస్తకములో నేనే ఎప్పుడో పెట్టాను. నేనే మర్చిపోయాను. నేను పది రూపాయలు అడిగాను. నీ పది రూపాయలు అక్కరలేదు. నేను పెట్టుకున్న పదిరూపాయలే నాకు చిక్కింది'. తనయందే వెతకాలిగానీ బయట యేమాత్రము వెతకనక్కరలేదు.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! ఎన్నోరకములైన భయభ్రాంతులతో ఎన్నోరకములైన ప్రయత్నములు చేస్తున్నారు. మీరు ఏ వస్తువునైనా బయట వతకకండి. మీయందే ఉంటున్నది. మీ సర్వస్వము మీయందే ఉంటున్నది.

బయట అంతయూ కల్పనలు. ఆ కల్పనలు తట్టుకోండి. అప్పుడే శాంతి కలుగుతుంది. నేను నేనే అని తెలుస్తుంది. ఈ విషయాన్ని తెలుసుకోటానికి చాలా గ్రంథాలు చదివి, చాలా సాధనలు సల్పుతున్నారు. గ్రంథాలు బయట పారవేయండి. నిన్ను నీవు చూసుకో.

భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే..

(2003 డిసెంబరు 25వ తేదీ క్రిష్టమస్ సందర్భముగా సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)